తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కుప్పం భారీ పేలుడు శబ్దం

**భయాందోళనలో ప్రజలు- అంతకుముందే హెలికాప్టర్ చక్కర్లు..**
**గ్రహ శకలాలు ఢీకొని ఉంటాయా.. అంతు చిక్కని మిస్టరీ !!**

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త

కుప్పం ప్రాంత ప్రజలు శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా భారీ విస్ఫోటనం జరిగిన శబ్దం రావడంతో జనం భయభ్రాంతులకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఏం జరిగిందో తెలుసుకోవాలని ఎంత ప్రయత్నించినా ఫలితం కన్పించలేదు. అయితే ఈ శబ్దం వచ్చిన సమయంలో ఆకాశంలో దట్టమైన పొగ కన్పించిందని పలువురు స్థానికులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం పదకొండు గంటల నుంచే ఓ హెలికాప్టర్ ఆకాశంలో చక్కర్లు కొడుతూ కన్పించింది. తొలుత హెలికాప్టర్ బ్లాస్ట్ అయి ఉంటుందని పుకార్లు షికార్లు చేశాయి. అయితే అది అబద్ధం అని తేలింది. ఒక్కసారిగా ఆకాశం వైపు నుంచి భారీ శబ్దం వచ్చిన నేపథ్యంతో పాటు పొగ కూడా రావడంతో ఏదైనా గ్రహ శకలాలు ఒకదానికి ఒకటి ఢీకొని భారీ శబ్దం వచ్చి ఉంటుందనే అనుమానాలు ఉన్నాయి. ఏది ఏమైనా శబ్దం ఎక్కడనుంచి వచ్చి ఉందనేది అంతు చిక్కని మిస్టరీగా మారింది.

## అన్నదానం ట్రస్ట్‌కు కోటిరూపాయలు విరాళం

తిరుమల, ఆగస్ట్ 3ప్రభాతవార్తప్రతినిధి:



బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన సుమధుర గ్రూప్ సిఎండి మధుసూదన్ టిటిడి అన్నప్రసాదం ట్రస్ట్‌కు కోటిరూపాయలు విరాళం అందించారు. శనివారం రాత్రి ఈ విరాళాలడిడిని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు భరత్‌కుమార్, నవీన్‌కుమార్ , శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### అవ్వ మనవళ్లను
## బలిగొన్న కోనేరు







**కోనేరు, మృతి చెందిన తులశమ్మ,ఆద్విక్‌లు**

సదుం,ఆగస్టు3ప్రభాతవార్త

మండల పరిదిలో మనవడిని కాపాడబోయి అవ్వ మనవడు మృతి చెందిన సంఘటన శనివారం సదుం వద్ద జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు పీలేరుకు చెందిన తులసమ్మ(55) సదుం వద్ద ఉన్న కొత్తపల్లెలో తమ సమీపబంధువుల ఇంటి వద్ద కొత్తగా ఇంటిని నిర్మిస్తోంది. ఈక్రమంలో ఆమె తన కుమారుడు చరణ్ బిడ్డ అయిన ఆద్విక్(3)ను 5 రోజుల కిందట కొత్తపల్లెకు తీసుకువచ్చింది. ఇక్కడే ఉంటూ ఉండేవారు. శనివారం కొత్తపల్లెలోని శ్రీవెంకటేశ్వరస్వామివారి ఆలయానికి వెళ్లిన అవ్వ మనవళ్లు నడచుకుంటూ ఇంటికి బయలుదేరారు. మార్గమద ్యంలో గ్రామంలోని విరూపాక్షమ్మ ఆలయం వద్ద ఉన్న కోనేరు వద్దకు మనవడు ఆద్విక్ వెళ్లాడు. చెప్పులు వదలి మెట్లపై ఆడుకుంటూ కోనేరులో పడిపోయాడు. మనవడిని వెతుకుతూ వచ్చిన తులసమ్మ కోనేరు వద్ద ఉన్న బాలుడి చెప్పులు చూసి గబగబా తాను కూడా చెప్పులు తీసి కోనేరులో దిగింది. ఈక్రమంలో ఆమె కూడా మునిగిపోయింది. ఇద్దరి చెప్పులు కోనేరు వద్ద ఉన్న విషయం గమనించిన గ్రామస్థులు కోనేరులో దిగి వెతకగా వీరి మృతదేహాలు దొరికాయి. అంత వరకు బాగా ఉన్న ఇద్దరు అకస్మాత్తుగా శవాలై బయటపడటంతో బందువులు, గ్రామస్థులు గొల్లుమన్నారు. చిన్న బిడ్డను చూసి అందరి హృదయాలు ద్రవించాయి. ఇప్పుడు ఇక్కడ కనపడిందే అప్పుడే చనిపోయారా అని బందువులు ఏడుపులతో గ్రామం మొత్తం విషాదం నిండుకుంది. ఈసంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

## కన్నుల పండువగా పల్లకి సేవ పరవశించిన భక్త జనం

### -ముగిసిన ఆడికృత్తిక మహోత్సవాలు





శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో చివరి గ్రామోత్సవం పల్లకి సేవ.శనివారం అమావాస్య కావటంతో మూడు పల్లకీలను ఏర్పాటు చేసారు.సోమాస్కంద మూర్తి, అమ్మవారు, వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి మరో పల్లకిలు ఏర్పాటు చేసారు. ఈ సేవకు గతంలో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. రాను రాను ఉత్సవాలు మొక్కుబడిగా ఊరేగింపులకే పరిమితమౌతున్న దశలో సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ పురాతన సంప్రదాయాలను కాపాడటానికి అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. ఉత్సవాలను సమయపాలనతో తీసుకురావటంతో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.ముఖ్యంగా పట్టణంలో నిర్వహించే ఉత్సవాలను సమయపాలనతో తీసుకురావటానికి ఆయన కృషి ఫలించిందని చెప్పవచ్చు.

**అకట్టుకున్న పల్లకి సేవ:**

శనివారం పల్లకి సేవ రావటంతో భక్తులు షణ్ముఖుని మనసారా దర్శించుకున్నారు. ఆలయంలోని అలంకార మండపంలో వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామిని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు అలంకార గురుకుల్ రాజేష్, సూరిలు ముస్తాబు చేసారు. డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్ పెక్టర్లు సుదర్శనం నాయుడు, నాగభూషణం యాదవ్, హారతులిచ్చి గ్రామోత్సవానికి సాగనంపారు. పల్లకిలో వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి రాగా పల్లకి సేవ ప్రారంభమైంది.కాగా అమావాస్య కావటంతో స్వామి అమ్మవార్ల ను ఏర్పాటు చేసారు.

**పల్లకి సేవ: కనువిందుచేసే . . .**

ఆడికృత్తిక 10వ రోజు నిర్వహించే గ్రామోత్సవం పల్లకిసేవ. పల్లకి ఉత్సవం అంగరంగవైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. నాల్గుమాడావీధుల్లో ఎటు చూసినా రద్దీ ఏర్పడింది. కృత్తిక ఉత్సవాల్లో అత్యంత శోభాయమానంగా నిర్వహించే ఉత్సవాల్లో పల్లకి సేవ ఒకటి.ఈ ఉత్సవాన్ని స్థానిక ఉత్సవంగా నిర్వహిస్తారు. శనివారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకరించి ప్రతిష్టించారు. గ్రామోత్సవాల్లో ఇది చివరి ఉత్సవం కావటంతో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. తేరువీధిలో బాగా రద్దీ ఏర్పడింది. బోయిలు స్వామి అమ్మవార్ల పల్లకీల్ని మోసుకుంటూ వెళుతుండగా భక్తులు హారతులిస్తూ ముందుకు సాగించారు.స్వామి అమ్మవార్ల తేజ స్సును తిలకించుటకు వేయికళ్ళు అయినా చాలవన్నట్లు ముస్తాబు చేశారు. పల్లకిలకు విద్యుత్ దీపాలు పూలతో ముస్తాబు చేశారు.స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ రాజేష్, సూరిబాబులు ముస్తాబు చేయగా ఉత్సవాన్ని ఆలయ ఇఒ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి ప్రాంభించారు. రాత్రి ఆలయం నుంచి పల్లకి ఉత్సవం ప్రారంభం అయ్యింది.ఇఒ ఉత్సవాన్ని సకాలంలో నిర్వహించుటకు చొరవ చూపారు. ఉత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

## నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

### డ్రైవర్‌గా ఎమ్మెల్యే గురజాల - ప్రయాణికుడిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి





**అర్టీసీ బస్సును నడుపుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు.**
**సాధారణ ప్రయాణీకుడిలా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో కలిసి అర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి.**

చిత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరు అర్టీసీ డిపోలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అర్టీసీ బస్సు ప్రయాణికుడిగా, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అర్టీసీ బస్సు డ్రైవర్‌గా అవతారం ఎత్తారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, అర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ప్రయాణం చేశారు. చిత్తూరు అర్టీసీ టుడిపోలో శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి 17 నూతన అర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. ఈ క్రమంలో కొత్తగా రోడ్డెక్కాల్సిన ఒక బస్సులో డ్రైవర్‌గా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు కూర్చొని అర్టీసీ బస్సును నడుపగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణీకుడిగా ప్రయాణం చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు నడిపిన బస్సు అర్టీసీ బస్టాండ్ నుండి గాంధీ సర్కిల్ వరకు వచ్చి మళ్ళీ అర్టీసీ బస్టాండ్‌కు చేరింది.

**మంత్రి ప్రారంభించిన బస్సుల వివరాలు:**

చిత్తూరు-2 డిపో నుండి 5 బస్సులు: 2 సూపర్ లగ్జరీ 3 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు
చిత్తూరు-1 డిపో: ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు
కుప్పం-2 డిపో: 2 ఎక్స్‌ప్రెస్ బస్సులు.
అన్నమయ్య జిల్లా:
మదనపల్లి-1 డిపో: 2 ఎక్స్‌ప్రెస్ బస్సులు
మదనపల్లి-2 డిపో: 3 బస్సులు( 1 సూపర్ లగ్జరీ, 2 పల్లెవెలుగు)
పీలేరు డిపో: 3 బస్సులు(2 పల్లెవెలుగు, ఒక ఎక్స్‌ప్రెస్)
రాజంపేట డిపో: ఒక ఎక్స్‌ప్రెస్‌బస్సు.

### అక్టోబర్‌లో తొమ్మిదిరోజులు
## ప్రత్యేక దర్శనాలు రద్దు

### అంతా సర్వదర్శనమే -అసౌకర్యం లేకుండా విస్తృత ఏర్పాట్లు :టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల,ఆగస్ట్ 3ప్రభాతవార్తప్రతినిధి:

ఆపదమొక్కులవాడు...తిరుమల శ్రీవారికి అక్టోబర్ 4వతేదీ నుండి 12వతేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా వస్తారని, అందుకు తగ్గట్లు విస్తృత ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంగా ఏర్పాట్లపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆ తొమ్మిదిరోజులు అన్ని ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలు రద్దు చేయడం జరుగుతుందన్నారు. పూర్తిగా సర్వదర్శనం మాత్రమే అమలవుతుందన్నారు. అక్టోబర్ 8న గరుడసేవరోజు అశేషభక్తులకు అవసరమైన సేవలందించేందుకు ఇప్పటినుండే అదనపు సిబ్బంది విధులపై కార్యాచరణ సిద్ధంచేయాలని సూచించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా చూద్దామని అదనపు ఈఓ వెంకయ్యచౌదరి అధికారులకు నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సిఈ నాగేశ్వరరావు, ఎస్వీబిసి సిఇఒ షణ్ముఖకుమార్, విజిలెన్స్‌వింగ్ విఎస్ఒ రామ్‌కుమార్,డిప్యూటీ ఈఓలు లోకనాథం, పి.హరీంద్రనాథ్, సిపిఆంఒ డాక్టర్ తలారి రవి ,ఆలయ అర్చకులు,అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి విఎస్‌ఓగా సురేంద్ర

తిరుమల,ఆగస్ట్ 3ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి (తిరుపతి)గా అల్లం సురేంద్ర బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో శ్రీవారి ఆలయ ఏవిఎస్ఓగా, అలిపిరి ఏవిఎస్ఓగా ,సెక్టార్‌లో ఏవిఎస్ఓగా సమర్థవంతంగా, మంచిఅధికారిగావిధులు నిర్వహించారు. ఆయన తిరుపతి విఎస్ఓగా నియమితులు కావడంతో పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్నారు.

## టిటిడి సివిఎస్‌ఓగా శ్రీధర్



తిరుమల,ఆగస్ట్ 3ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ టిటిడి ముఖ్యనిఘాభద్రత అధికారిగా(సివిఎస్ఒ) సుసారపు శ్రీధర్ నియమితులయ్యారు. 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన పోలీసుశాఖలో మంచి సమర్ధవంతమైన, నిజాయితీ కలిగిన అధికారిగా పేరు ఉంది.

### పాల ఉత్పత్తి
## మరింత పెంపుపై దృష్టి

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు టౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త:

జిల్లాలో పాల ఉత్పత్తి మరింత పెంపుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొంటున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పాడి రైతులకు వివిధ డెయిరీలు ఇస్తున్న పాల ధర, పాల ఉత్పత్తి పెంచడానికి చేపట్టాల్సిన చర్యలపై జిల్లాలోని 21 ప్రైవేటు డెయిరీల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతుకు ఒకొక్క డెయిరీ ఒకొక్క ధర ఇస్తోందని, జిల్లాలో వ్యవసాయం తరువాత ఉద్యాన, పాడి పరిశ్రమపై రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. వెన్నె వ్యత్యాసం ఒకే విధంగా వున్నప్పటికి ధర వ్యత్యాసం వుండటానికి గత కారణాలపై సమావేశంలో కలెక్టర్ చర్చించారు. జిల్లాలో పాల ఉత్పత్తి మరింత పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వివిధ డెయిరీల ప్రతినిధులు మాట్లాడుతూ పాల ధర వ్యత్యాసానికి డిమాండ్, సప్లై కారణం అన్నారు. అలాగే వివిధ డెయిరీలు పోటీల ఆధారంగా పాల ధరల్లో మార్పు వుంటుందన్నారు. కర్నాటక రాష్ట్రంలో సహకార శాఖ డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు ఒక లీటరుపై 5 రూపాయలు ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ విధానంను మన రాష్ట్రంలో అమలు చేస్తే బాగుంటుందని, అలాగే ప్రస్తుతం పశుభీమా పథకం ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే అమలు చేస్తున్నారని, ఈ పథకంను సంవత్సరం మొత్తం అమలు అయ్యేలా చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం అందస్తున్న రూ.30 వేల బీమా మొత్తంను పెంచాలని, తద్వారా పాల ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం వుంటుందని డెయిరీల ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లాలో పాడి రైతులకు అవసరమైన పశుగ్రాసం జొన్న, మొక్కజొన్న విత్తనాలను సరఫరా చేయడం జరిగిందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధకశాఖ డిడిలు గోవిందయ్య, ఆరీఫ్‌లు, 21 డెయిరీల ప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అపజయాల నుంచి విజయాల దిశగా ఇస్రో

### : ఎన్నో పాఠాలు నేర్చుకొని ఇంతదాకా ఎదిగాం
### - ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్



శ్రీహరికోట (తడ), ఆగస్టు 3 ప్రభాతవార్త

అంతరిక్ష పరిశోధనలు, ప్రయోగాల్లో ఎన్నో అపజయాలు తట్టుకొని విజయాల వైపు దూసుకెళ్లామనిఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇస్రో ప్రధాన కార్యాలయం బెంగళూరు నుంచి పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రత్యక్ష ప్రసారంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒక విద్యార్థి ఇతర దేశాలకన్నా మించి ఇటీవల మనం సాధిస్తున్న విజయాలను కొనియాడుతూ ఇందుకు మీరు ఎలా స్పందిస్తారని ప్రశ్నించారు. దీనికి ఛైర్మన్ తన సమాధా నంలో కొన్ని ప్రపంచ దేశాలతో పాటు ఇస్రో కూడా అపజయాలకు కొత్తేమీ కాదన్నారు. ఎన్నో పరీక్షలను తట్టుకొని తాము విజయ వంతంగా రాకెట్లను ఎగరవేయగలుగుతునా ్నమన్నారు. మన దేశానికి సంబంధించి చంద్రయాన్-3 ప్రయోగ విజయం తర్వాత బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్‌లో గగన్‌యాన్‌తో పాటు ఇతర ప్రయోగాలు విజయవంతంగా జరిపి మరోసారి అందరి ప్రశంసలు పొందుతామని ఛైర్మన్ అన్నారు. ఈ లైవ్ కార్యక్రమాన్ని దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాల్లో ఉన్న శాస్త్రవేత్తలతో పాటు ఎంతోమంది పిల్లలు వీక్షించారు.

## ఇంకెప్పుడు పదవులు "బాబూ"!

### - నామినేటెడ్ పదవులపై తెలుగుతమ్ముళ్ళ గంపెడాశలు !



ప్రభాతవార్త-తిరుపతిటౌన్:

అధికారం ఉన్నా...లేకున్నా పార్టీ కోసం ప్రాణాలకు త్యజించి...., అధినేతకు అండగా నిలబడిన తెలుగుతమ్ముళ్ళు ఇప్పుడు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవులు ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని నియోజకవర్గాల్లో ఉన్న నాయకులకు ఎవరికి దక్కుతాయనే సందిగ్ధత నెలకొంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో, ఓట్ల లెక్కింపు సమయంలో అప్పటి అధికార వైసిపిని ఎదుర్కొనేలా ధీటుగా తెలుగుతమ్ముళ్ళు పని చేశారు. అయితే ఆ ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు కలసి కూటమిగా ఏర్పడటం, ఆ మూడు పార్టీల నేతలు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం ప్రాకులాడటం తెలుగుతమ్ముళ్ళకు మింగుపడని విషయంగా మారింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సందర్భాల్లోనూ పరిమితంగానే కొన్ని శాఖల నామినేటెడ్ పదవులు పార్టీ నాయకులతో భర్తీచేశారు. 2019-24 మధ్య ఐదేళ్ళు రాష్ట్రంలో వైసిపి అధికారంలో ఉన్న ప్రభుత్వంలో కులాల వారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడం, వీటికి ఛైర్మన్‌లుగా, డైరెక్టర్ పదవులను అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి నేతలు, కార్యకర్తలకు కట్టబెట్టారు. పూర్తిగా ఆ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ పదవులు సృష్టించి భర్తీ చేశారు. చివరకు హిందూ ధార్మికసంస్థ టిటిడిలో కూడా ధార్మికమండలి పేరుతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేసి వైసిపి అనుయూయులకు అందలం ఎక్కించారు. ఇంకా పలు శాఖలకు అదనపు నామినేటెడ్ పోస్టులు సృష్టించి భర్తీచేశారు. ఇప్పుడు రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అదికారంలోఉంది. గత ఐదేళ్ళుగా పార్టీని నమ్ముకుని పనిచేసిన తెలుగుతమ్ముళ్ళు జిల్లాలో భారీ సంఖ్యలోనే ఉన్నారు. వీరంతా తుడ, గ్రంధాలయ ఛైర్మన్, టిటిడి ఛైర్మన్, పాలకమండలి సభ్యులు, తిరుపతి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు, తాతయ్యగుంట గంగమ్మఆలయ ఛైర్మన్, ధర్మకర్త సభ్యులు. మార్కెట్ కమిటీలు, నెడ్‌క్యాప్, సింగిల్‌విండోలు, జడ్పీపదవులు, రవాణాశాఖ డైరెక్టర్ పదవులు ఇలా భారీగానే ఉన్నాయి. వీటిల్లో అత్యధికశాతం టిడిపి నేతలకే కట్టబెట్టాలని మెజార్టీ నాయకులు చంద్రబాబుపై ఒత్తిడి పెంచారు.

## ఎస్ఆర్‌పురం తహసిల్దారుగా అమరనాథ్

శ్రీరంగరాజపురం, ఆగస్టు 3 ప్రభాతవార్త:



ఎస్ఆర్ పురం మండల తహసిల్దారుగా అమరనాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధులు నిర్వర్తించడానికి వచ్చిన తహసిల్దారు అల్ఫ్రెడ్ సొంత జిల్లాకు బదిలీపై వెళ్ళడంతో ఆయన స్థానంలో అమరనాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దారు అమరనాథ్ మాట్లాడుతూ మండల పరిధిలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు.

## పూతలపట్టు తహసిల్దారుగా గుర్రప్ప

పూతలపట్టు, ఆగస్టు 3 ప్రభాతవార్త:



పూతలపట్టు మండల తహసిల్దారుగా ఎన్ఎం గుర్రప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్ఎం గుర్రప్ప గతంలో గుడిపాల తహసిల్దారుగా విధులు నిర్వ హిస్తు ఎన్నికల విధుల్లో భాగంగా కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ నుండి రిలీవ్ అయిన ఎన్ఎం గురప్ప పూతలపట్టు మండల తహసిల్దారుగా నియమితులు కావడంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## మూడు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

తవణంపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త:



మండలంలోని బహుదానది నుండి ఇసుకను అ క్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను శని వారం దుంయ సజ్ చేసినట్లు స్థానిక ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని ఎగువ తవణంపల్లె, మైనగుండ్లపల్లె వద్ద బహుదానదిలో ఇసుకను అక్రమంగా తరలి స్తుండగా మూడు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు తెలిపా రు. ఈసందర్భంగా వీర్లగుడిపల్లెకు చెందిన హరి(29), తవణంపల్లె ఎగువ అరుందతివాడకు చెందిన పి.చిన్నస్వామి(52), దిగువ అరుందతివాడకు చెందిన వినాయకంను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించాలి

తవణంపల్లె, ఆగస్టు 3 ప్రభాతవార్త:



స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు పగడ్బందీగా నిర్వ హించాలని ఎన్నికల నిర్వహణ పూతలపట్టు నియో జకవర్గ ఇన్‌చార్జి జయప్రకాష్‌నాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా పగడ్బందీగా నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

చౌడేపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త

ఆగివున్న బొలోరో వాహనాన్ని స్కూటర్ ఢీకొని వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన శనివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారిలో చౌడేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కేబుల్‌నెట్‌వర్కు చేసుకొనే వ్యక్తులు తమ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకొన్నారు. చౌడేపల్లి వైపు వస్తున్న స్కూటర్‌కు ఎదురుగా మరో వాహనం లైటింగ్ పడింది. దీంతో అతను వాహనానికి దారి ఇవ్వబోయి అప్పటికే పార్కింగ్‌లో వున్న బొలోరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మండలంలోని దిగువపల్లి పంచాయతీ నగిరిమిట్టపల్లికి చెందిన శివ(35)కు బలమైనా గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానికులు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్యపరిస్థితి విషమించడంతో వైద్యులు మదనపల్లికి సిఫారస్సు చేసారు.

## రేపు మంత్రి రాంప్రసాద్ పర్యటన

పుంగనూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త

పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి రాంప్రసా ద్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నారని పార్టీ మండ లాధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. ఈమేరకు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో జరిగిన సమా వేశంలో ఆయన ఈవిషయాన్ని వివరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లాబాబుతో పాటూ మంత్రి సోమవారం ఉదయం పట్టణంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తారన్నారు. అనం తరం ఆయన నాయకులతో సమావేశమైన నేతిగుట్లపల్లి రిజర్వాయర్, షికారీ ఇండ్ల వద్ద భూఆక్రమణలు గురైన ప్రాంతాలను పరిశీలిస్తారని వివరించారు. టిడిపినేత సివిరెడ్డి, పోలీస్‌గిరితో పలువురు పాల్గొన్నారు.

## బిఆర్‌డి ఆస్పత్రిచే ఉచిత వైద్య శిబిరం

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



కుప్పంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్ప త్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబెఉ అధ్వర్యంలో గుడుపల్లె మండలం పిబి వాడలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసంద ర్భంగా సుమారు 130మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా॥ దేవేంద్రనాయుడు, సిబ్బంది, పిఆర్వో శ్రీనివాస మణి పాల్గొన్నారు.

## కుప్పంలో ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



కుప్పం పట్టణం వజ్రవేలు శెట్టి వీధిలో ఓ ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం వెలుగు చూసింది. స్థానికులు, బ్యాంకు సిబ్బంది తెలిపిన మేరకు వివరాలిలా.. భాకరాపేటకు చెందిన ఉదయ్‌కుమార్ (28) కుప్పంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో పర్సనల్ లోన్ ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. ఇతను బ్యాంకుకు సమీపంలోనే ఓ ఇంట్లో అద్దెకు ఉండేవాడు. శనివారం ఉదయం బ్యాంకు సిబ్బంది ఉదయ్‌కుమార్‌కు ఫోన్లు చేసినా తీయకపోవడంతో వారు ఉదయ్‌కుమార్ ఇంటి వద్దకు వెళ్లారు. అయితే ఏం జరిగిందో తెలియదు గానీ ఉదయ్‌కుమార్ ఇంట్లో ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతుడి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు.

## ప్రభుత్వ హాస్టల్‌కు వంటసామగ్రి వితరణ

కుప్పంరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త



కుప్పంలోని ప్రభుత్వ బాలుర అతిథిగృహానికి అవసరమైన వంటసామగ్రిని బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్, కుప్పం లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో బిసిఎన్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్‌ను అభినందించారు. అడిగిన వెంటనే ముప్పై వేల విలువ చేసే గ్రైండర్‌ను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ సలహాదారు డా॥ మహేష్, మాజీ అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, కార్యదర్శి సెంథిల్, డైరెక్టర్లు శివశంకర్, సుబ్రమణ్యం, సభ్యులు మణి, సుబ్రమణ్యం, గిరిధర్, నేతలు రాజేష్, వార్డెన్ మురళినాయక్ పాల్గొన్నారు.

## కుప్పం ఆర్డీఒగా శ్రీనివాసులు రాజు బాధ్యతలు

కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త



కుప్పం రెవెన్యూ డివిజన్ అధికారిగా కొండూరు శ్రీనివాసులు రాజు బాధ్యతలు చేపట్టారు. నూతన ఆర్డీఒ ఇదివరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆర్డీఒగా పనిచేశారు. కుప్పం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఒ శ్రీనివాసులునుంచి కొత్త ఆర్డీఓగా శ్రీనివాసులు రాజు బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కడ పి.డి. వికాస్ మర్మత్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆర్డీఓ శ్రీనివాసులు రాజు పేర్కొన్నారు.

## ఈచర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వి.కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



వి.కోట – కుప్పం ప్రధాన రహదారిలో పడిగలకుప్పం వద్ద ఈచర్ వాహనం టువీలర్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం ఎన్టీఆర్ కాలనీకి చెందిన సందాని (38) సొంత పనుల నిమిత్తం టు వీలర్‌లో వి.కోటకు వచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యంలో పడిగలకుప్పం వద్ద ఎదురుగా వస్తున్న ఈచర్ వాహనం ఆటోను తప్పించబోయి ఎదుట వస్తున్న టువీలర్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ సందాని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. మృతదేహాన్ని పంచనామాకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## తహశీల్దార్ హనుమంతు నాయక్ బాధ్యతల స్వీకరణ

చౌడేపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త



మండల తహశీల్దార్‌గా హనుమంతు నాయక్ నియమితులయ్యారు. శనివారం ఈమేరకు ఆయన స్థానిక మండల పరిపాలనా భవనంలోని తహశీల్దార్ ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. మండలంలోని రెవిన్యూ సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా చర్యలు చేపడుతానన్నారు. డిటి మాధవి, మండల సర్వేయర్ గుణశేఖర్, విఆర్ఓలు, సచివాలయ అధికారులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ హనుమంతు నాయక్‌ను సత్కరించారు.

## 5న మంత్రి మండిపల్లి పర్యటనను విజయవంతం చేద్దాం

చౌడేపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త



ఈనెల 5న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), యువనేత మాది రాజు ప్రదీప్‌రాజులు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీశ్రీనివాసా కళ్యాణ మండపంలో మండల స్థాయి తేదేపా నాయకులు, కార్యకర్తలు సమావేశం జరిగింది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తొలిసారి చేస్తున్న పర్యటనను విజయవంతం చేయడానికి అందరూ తరలిరావాలన్నారు. అనంతరం పర్యటనపై సమీక్షించారు. తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్‌రాజు(గిరి), జంపాల శ్రీనివాసులు నాయుడు, బోయకొండ సుబ్బు, మునివెంకప్ప, మదుసూదన్‌రెడ్డి, మురళీనాయుడు, సోషియల్ మీడియా ప్రతినిధి కళ్యాణ్, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాదమరి-కాశిరాళ్ళ రోడ్డుకు మోక్షం కల్పించండి

– సిఎం చంద్రబాబును కలిసి విన్నవించిన సప్తగిరి ప్రసాద్

పూతలపట్టు, ఆగస్టు 3 ప్రభాతవార్త:



జిల్లాలోని యాదమరి మండలం యాదమరి– కాశిరాళ్ళ రోడ్డు మరమ్మత్తు పనులను సత్వరం చేపట్టి స్థానిక ప్రజల ఇబ్బందులను పరిష్కరిం చాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ సిఎం నారా చంద్రబా బు నాయుడును కలిసి విన్నవించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎం నారా చంద్రబాబునాయుడును సప్తగిరి ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా సప్తగిరి ప్రసాద్ సిఎం దృష్టికి చిత్తూరు నుండి అరగొండకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, అర్దగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో తొలగించిన ఎనిమిది మంది కాంట్రాక్టు ఉద్యోగులను మళ్ళీ విధుల్లో చేర్చుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సిఎం సత్వరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయంచే యోగా తరగతులు

తిరుపతి క్రీడ, ఆగస్టు 3, ప్రభాతవార్త

శ్రీ శ్రీనివాస క్రీడా సముదాయం ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ యస్. సయ్యద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్య సమస్యలు అధిక బరువు, గైనిక్, థైరాయిడ్, ఆస్తమా, ఆర్థరైటిస్, మధుమేహం, బ్యాక్ పెయిన్, న్యూరో సమస్యలు, ప్రెగ్నెన్సీ యోగ, అదే విధంగా పిల్లలకు సూపర్ బ్రెయిన్ యోగ, బ్రెయిన్ జిమ్, స్పోర్ట్స్ యోగ వంటి క్లాసులు చెప్పడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి తెలిపారు. మరెన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9985394350కు సంప్రదించాలన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోటారెడ్డిని ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ పరామర్శ

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



కోట మండలం ఊనుగుంటపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు తన్నమాల కోటారెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందారు. శనివారం ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఊనుగుంటపాలెంకు వెళ్లి తన్నమాల కోటారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మొబిన్‌బాషా, నాగూర్ యాదవ్, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

సూళ్లూరుపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామంలో ఆత్మ నెల్లూరువారి సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. శనివారం తిరుపతి జిల్లా వనరుల కేంద్రం కెవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.అనిత, మండల వ్యవసాయ అధికారి ఎన్.కవిత పాల్గొన్నారు. కెవి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలంలో మట్టిని మూడుసంవత్సరాలకు ఒకసారి తప్పకుండా పరీక్ష చేయించుకోవాలన్నారు. రైతులు మట్టిని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇచ్చి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. రైతులు మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా వేయాల్సిన మోతాదులో మాత్రమే ఎరువులు వేసి నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని తెలిపారు. సాధారణంగా వరిలో ఒక ఎకరాకు డిఎపి ఒక బస్తా దుక్కిలో, యూరియా మూడు బస్తాలు నాలుగు దఫాలుగా మరియు పొటాష్ 25కి 25 కేజిలు చివరి దశలో వేయాలని తెలిపారు. అలాగే పురుగు మందులు కూడా అవసరమైన మేరకే పిచికారి చేసి ఖర్చు తగ్గించుకొని నాణ్యమైన దిగుబడి పొందాలన్నారు. ఎడిఎ అనిత మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వరి వేసిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద వారి వివరాలు ఇచ్చి మీ పంటను ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎలు హిమబిందు, నాగరాజు, ఈశ్వరయ్య, రైతులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

చిట్టమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త



చిట్టమూరు మండలం అరవపాలెం పంచాయతీ పరిధిలోని బయ్యావారికండ్రిగ గ్రామానికి చెందిన ఓజిలి శ్రీనివాసులు కుమార్తె మోనిష పుట్టినరోజు సందర్భంగా టిఎంఆర్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థులకు వారి విద్య అవసరాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున రూ.10 వేలు కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి ద్వారా అందజేశారు. మోనిషపై ఉన్న మమకారంతో తండ్రి శ్రీనివాసులు ఇలాంటి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం పట్ల మండల ప్రజలు సైతం మోనిషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టిఎంఆర్ వ్యవస్థాపకులు తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జన్మదినం, పెళ్లి వంటి శుభకార్యాల రోజుల్లో ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేయడం అనేది శుభ పరిణామమని చెప్పారు. ఈ ఆచారాన్ని ప్రతి ఒక్కరూ పాటించినట్లయితే పేద విద్యార్థులకు చాలా మంచి జరుగుతుందని మనోహర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపాల్ రహమతుల్లా, మేనేజర్ ఆశా శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

చిట్టమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త

అమృతతుల్యమైన తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం చిట్టమూరు మండలం దరకాస్తు అంగన్‌వాడీ కార్యకర్త ధనమ్మ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఆమె తెలిపారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమని, తల్లీబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంత అవసరమో గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటిగంటలోనే తల్లిపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు డబ్బా పాలు పట్టకుండా తల్లిపాలతోనే బిడ్డ ఆలనపాలన చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ధనమ్మతో పాటు అరవపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది కవిత, ఎఎన్ఎం హైమా, తల్లులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం : సిడిపిఓ

దొరవారిసత్రం, ఆగస్టు 3 ప్రభాతవార్త

తల్లిపాలు తాగించడం ద్వారా బిడ్డకు శ్రేయస్కరమని సిడిపిఓ శారదాంబ తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఏకొల్లు అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలు తాగించడం వల్లన పిల్లలకు వ్యాధినిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం తల్లులు పిల్లల ఆరోగ్యవిషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లల తల్లులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సూపర్‌వైజర్ హేమలత, అంగన్‌వాడి టీచర్లు, పిల్లల తల్లులు తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుంటలు పూడ్చివేత

బాలాయపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త



స్థానిక ఆర్టిక బస్టాండ్ ఆవరణలో ఉన్న గుంటలను అధికారులు ఎట్టకేలకు పూడిపించారు. బస్టాండ్ ఆవరణలో గుంటలో ఉన్నందువల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటల కారణంగా బస్టాండ్‌లోకి బస్సులు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్ ఆవరణలో ఉన్న గుంటలను పూడ్చడంతో ప్రయాణికులు హర్షించారు.

## త్వరగా అన్న క్యాంటీన్ పనులు పూర్తి చేయాలి

ఆర్డీవో కిరణ్ కుమార్

వెంకటగిరి, ఆగస్టు 3 ప్రభాతవార్త



త్వరగా అన్న క్యాంటీన్ పనులను పూర్తి చేయాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ అన్న క్యాంటీన్ ప్రారంభిస్తున్నారని పనులను ఆయన పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి భవనాన్ని అప్పగించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అన్నా క్యాంటీ న్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పనులను నాణ్య తగా చేయించాలని కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఈ శ్రీధర్లను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఇన్చార్జి తహశీల్దార్ రాంబాబు సిబ్బంది ఉన్నారు.

## డ్రైనేజీ కాలువల్లో పూడిక తీత

కమిషనర్ అబ్దుల్ రషీద్

వెంకటగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త



వర్షాకాలంలో ఇబ్బంది లేకుండా పట్టణంలోని మురుగు కాలువల్లో పూడిక తీసే పనులు చేపట్టినట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. పట్టణంలో పూడిక తీసే పనులను ఆయన పరిశీలించారు. కాలువల్లో చెత్తా చెదారం పేరుకుని ఉన్నందువల్ల నీటి ప్రవాహం వీధిలో రానేకుండా చెత్తాచెదారం తొలగిస్తున్నట్లు తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా కూడా కాలువలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. జెసిపి ద్వారా పట్టణంలోని పెద్దపాటి కాలువలను శుభ్రం చేస్తున్నారు. ఆయన వెంట శానిటరి ఇన్స్పెక్టర్ రామారావు, సిబ్బంది ఉన్నారు.

## హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు

వెంకటగిరి, ఆగస్టు 3, ప్రభాతవార్త



తారకరామా క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలో హోరా హోరీగా సాగుతున్నాయి. మూడవ రోజు కడప, చిత్తూరు జట్ల మధ్య పోటీలు జరిగాయి. కడప జట్టులో ఎస్ఎండి రఫీ, చిత్తూరు జట్టులో ధరణి కుమార్ సత్తా చాటారు. కడప జట్టు 56 రన్స్ విజయ సాధించింది.

## జిందాల్ కంపెనీచే విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం

**గూడూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త** తమ్మిన పట్నం గ్రామానికి చెందిన రామినేని రమేష్ పద్మమ్మల కుమారుడు క్రాంతి కిరణ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో లింగవరం గ్రామ పంచాయితీలో ఏర్పాటై ఉన్న జిందాల్ పవర్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం దృష్టికి గ్రామస్తులు తీసుకొనిపోవడంతో వెంటనే ముందుకు రావడం అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ విద్యార్థి క్రాంతి కిరణ్‌కు లక్ష ఇరవై వేల రూపాయిలు చెక్కును అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద తమ్మినపట్నం గ్రామంలో ఉన్న జిందాల్ పవర్ లిమిటెడ్ కంపెనీ లక్ష ఇరవై వేల రూపాయలను తమ్మిన పట్నం గ్రామానికి చెందిన క్రాంతి కిరణ్‌కు గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే బిడ్డలకు ఆరోగ్యం : సిడిపిఓ

బాలాయపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త



తల్లిపాలుతోనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. దగ్గవోలు, అల్లూరుపాడు అంగన్‌వాడి కేంద్రాలలో తల్లిపాలు ప్రాధాన్యతపై గర్భవతులు, బాలింతలకు అవగా హన కార్యక్రమం నిర్వహించిన ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సూపర్‌వైజర్లు పరిమళ, కల్పలత నిర్వ హించారు. తల్లిపాలు దేవుడు ఇచ్చిన వరం కాబట్టి ప్రతి తల్లి బిడ్డకు పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. తల్లిపాల వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లలు తెలివితేటలు కలిగి చురుగ్గా ఉంటారని సూపర్వైజర్ పరిమళ చెప్పారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని ఆమె వివరించారు.

## నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

– ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, ఆగస్టు 3 ప్రభాతవార్త



దివంగత పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఆశయాలను నేటి తరం కొనసాగించాలని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 46వ వర్ధంతిని పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో ఉన్న నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాడు పేద విద్యార్థుల కోసం నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వాకాడులో విద్యాసంస్థలను ప్రారంభించారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో బాలకృష్ణారెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

## రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త



మండల పరిధిలోని పాలిచర్లవారిపాలెంలో ఏర్పాటై ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు రోటేరియన్ చల్లా రామ్ కుమార్ దాతృత్వంతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల రెడ్డిలు మాట్లాడుతూ శరీరం ఆరోగ్యంగా ఉంటే మానసిక స్థితి ప్రశాంతంగా ఉంటుందని, అందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, చదువుతోపాటు క్రీడల్లో కూడా యువత రాణించాలని, అందుకు కావాల్సిన సహాయ సహకారాలను మా రోటరీ ద్వారా అందించడం జరుగుతుందని, ప్రస్తుతం ఉన్న పర్యావరణ పరిస్థితుల్లో మొక్కలను నాటడం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ వెస్ట్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, జోనల్ సెక్రటరీ ధనుంజయ రెడ్డి, రవీంద్రారెడ్డి, బలరామిరెడ్డి, వాసు, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, ఆగస్టు 3, ప్రభాతవార్త

చదువు ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తాను కూడా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడం వలన రాజకీయాల్లో ప్రవేశించేందుకు అవకాశం కలిగిందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. గూడూరు పట్టణంలోని ఎస్కెఆర్ జూనియర్ కళాశాలలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ విద్యార్థిని విద్యార్థులకు రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్ తదితర విద్యా మిత్ర పథకంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు యూనిఫామ్ తదితర విద్యా సామాగ్రిని అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులు చదువుల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. చదువుల్లో రాణించడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిలాని భాష, తెలుగుదేశం పార్టీ నాయకులు చెంచురామయ్య, శ్రీపతి బాబు, భుజిగేంద్రరావు, రెండవ పట్టణ సిఐ రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# నీటి కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు

## - కలెక్టర్ సుమిత్‌కుమార్ వార్నింగ్



చిత్తూరు టౌన్, ఆగస్టు 3 ప్రభాతవార్త: చేతి అద్దకం, యాంత్రిక అద్దకం పరిశ్రమల యాజమానులు నగరి పరిసర ప్రాంతాల్లో నీటి కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం నగరి చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో నడుస్తున్న అద్దకం పరిశ్రమల వల్ల దిగువ ప్రాంతాలైన నింద్ర, విజయపురం మండలాల్లో కలుగుతున్న కాలుష్యంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎపి కాలుష్య నియంత్రణ మండలి, అద్దకం పరిశ్రమలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నగరిలో ప్రస్తుతం వున్న వ్యర్థనీటిని శుద్ధీకరణ చేసే ప్లాంటు తరించే ప్రక్రియలో వున్న సమస్యలను ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ ద్వారా తనిఖీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. యాంత్రిక అద్దకం పరిశ్రమలన్ని జెడ్ఎల్‌డి సిస్టంను నాలుగు నెలల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన పురోగతిని ఎప్పటికప్పుడు కలెక్టర్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలికి తెలియజేయాలన్నారు. అలాగే నగరిలో ప్రస్తుతం నడపబడుచున్న అన్ని యూనిట్లకు సంబంధించి సమగ్ర సమాచారంను సేకరించాల్సిందిగా కాలుష్య నియంత్రణ మండలి, నగరి మున్సిపల్ కమీషనర్‌లను కలెక్టర్ ఆదేశించారు. వ్యర్థ నీటిని శుద్ధికరణ చేసే ప్లాంటు(సిఇటిపి)' నిర్వహణపై పదిహేను రోజుల్లో నిర్వహించే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. నగరి, చింతలపట్టేడ ప్రాంతంలో ప్రభుత్వం 16 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఒక రోజుకు 40 లక్షల లీటర్ల వ్యర్థనీటిని శుద్ధికరణ చేసే ప్లాంటు ఏర్పాటు చేసినప్పటికీ ఈ ప్లాంటు కేవలం 1.50 లక్షల లీటర్ల వ్యర్థనీటిని మాత్రమే శుద్ధి చేయడం జరుగుతున్నదన్నారు. చేతి అద్దకం పరిశ్రమల నుండి ఎక్కువ శాతం వ్యర్థ నీటిని మున్సిపల్ మురికికాలువల్లో విడుదల చేస్తుండటంతో పరిసరాల్లోని చెరువులు, నదులు, భూగర్భ జలాలు నీటి కాలుష్యానికి గురవుతు న్నాయన్నారు. దీంతో పాటు నగరి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో నడుపబడుతున్న 16 యంత్రిక అద్దకం పరిశ్రమల్లో నిబంధనల ప్రకారం ఏడు మాత్రమే నడవడం జరుగుతున్నదని, మిగిలిన పరిశ్రమలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని కాలుష్య నియతత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ అశోక్‌కుమార్‌కు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఎజిఎం భార్గవి, నగరి మున్సిపల్ కమీషనర్ మంజునాథ్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోస్టల్ కారిడార్ ఇచ్చిన భూములు సర్వే పూర్తి



చిల్లకూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త: చెన్నై బెంగళూరు కోస్టల్ కారిడార్ సంబంధించిన ఏపీఐఐసీకి కేటాయించిన భూములు ఇప్పటివరకు రైతులు సాగులో ఉన్నాయి. అయితే ఆ భూము గత ప్రభుత్వం ఏపిఐఐసీ వారుకి ఇవ్వాలంటూ గతంలో కోరడం జరిగింది. అప్పటి నుండి ఆ భూములో సాగులో ఉన్న రైతులకి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని పరిహారం ఇచ్చేంత వరకు భూములు వదిలే ప్రసక్తి లేదని రైతులు ముక్తకంఠంతో చెప్పడం జరిగిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల ఈ సమస్య తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి వచ్చిన మరుసటి రోజే తమ్మిన పట్నం గ్రామ రెవిన్యూలోని తీగపాల్యం వద్ద జులై 19వ తేది రైతులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో 4 సర్వే బృందాలు ఏర్పాటు చేసి ఏ రైతు ఏ సర్వే నెంబరు భూమిలో ఉన్నాడు వారు ఏ పంట ఏసి ఉన్నారు. పూర్తిస్థాయిలో 914 ఎకరాలు సర్వే చేయడం జరిగింది. ఈ నివేదికలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని పోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సర్వేలో చిల్లకూరు తాహశీల్దార్ కె. శ్రీనివాసులు, డిటి విజయలక్ష్మి, ఆర్ఐ మధులత, గ్రామ సర్పంచులు నాశన సుబ్రమణ్యం, నెల్లిపూడి సుబ్రమణ్యంతో పాటు రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## చేనిగుంట కాలనీలో మహిళ ఆత్మహత్య!

తడ, ఆగస్టు 3 ప్రభాతవార్త : తడ మండలం చేనిగుంట ఎస్సీ కాలనీలో ఈతిపాకుల మేరీ (25) గుళికల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం మృతురాలి తల్లి ఈతిపాకుల నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, వీరి కుటుంబం తమిళనాడులోని పలవర్‌కాడుకు చెందిన సంధ్యమ్మన్‌నగర్ కొంతకాలంగా చేనిగుంట ఎస్టీ కాలనీలో నివాసం ఉంటూ బేల్దారి పనులకు వెళుతున్నారు. అయితే మృతురాలి భర్త విజయ్ తరచూ మద్యం సేవించి గొడవకు దిగేవాడు. దీనితో అతనికి ఎన్నిసార్లు చెప్పిన మార్పు రాకపోవడం వల్ల శుక్రవారం కొంగలకు పెట్టే గుళికల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మొదట సూళ్లూరుపేటలో, అనంతరం గూడూరులో ఆమెను చికిత్స నిమిత్తం తరలించగా శనివారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**చేనిగుంట వద్ద రోడ్డు ప్రమాదం ఒకరు మృతి**

తడ మండలం చేనిగుంట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు, చేనిగుంట గ్రామం నుంచి ఒక హోటల్‌కి రోడ్డు దాటుతున్న కొల్లిపట్టు దయమ్మను చెన్నై నుంచి నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను గ్రామస్థులు అదే కారులో సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించినపనపటికీ ఆమె మరణించినట్లు భర్త సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో తమిళనాడుకు చెందిన కారు డ్రైవర్‌ను కూడా గుర్తించినట్లు తెలిసింది.

## శివయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి,ఆగస్టు 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ సిఎస్‌ఓ నాగభూషణం యాదవ్,12వ అడిషనల్ జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్, అడిషనల్ సివిల్ జడ్జి కృష్ణప్రియలు స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతు పూజలు జరిపించుకున్నారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## తప్పు చేసినవారిని శిక్షించండి

**-మహిళపై నమోదు చేసిన అక్రమ కేసులను తొలగించండి**

**-మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే నాని**



తిరుపతిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: గత వైకాపా ప్రభుత్వ హయంలో పాలకులు వ్యవస్థలను నిర్వీర్యం చేసి, అధికార యంత్రాం గాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని నియంతలా వ్యవహరించారని, అక్రమ కేసులు బనాయించి వేధించారని జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదు చేసారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసిన కమిషన్ చైర్‌పర్సన్‌ను శనివారం పద్మావతి అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేసారు. గత వైకాపా ప్రభుత్వం మహిళలు అనే విచక్షణను కోల్పోయి పులివర్తి సుధారెడ్డిపై జరిగిన దాడిని ఆమెకు వివరించారు. అధికారులను అడ్డుపెట్టుకుని మఠం భూములలో అక్రమ కట్టడాలను తొలగించే క్రమంలో బాధితులకు భరోసాగా వెళ్ళిన సుధారెడ్డి పట్ల అప్పటి ఈస్ట్ సి.ఐ. మహేశ్వరరెడ్డి, రేణిగుంట సి.ఐ. మల్లిఖార్జునలు అవహేళనగా మాట్లాడటంతో పాటు దుర్భాషలాడారని వివరించారు. సంఘటన స్థలంలో ఆమెను పక్కకులాగేసి ఆమె కాలుకు గాయం అయ్యేలా చేసారని, ఇప్పటికి కాలు గాయం నుండి ఆమె కోలుకోలేదని తెలిపారు. నియోజకవర్గంలోని మహిళలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి, సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేసారు. సుధారెడ్డిపై జరిగిన దాడికి సంబంధించిన తీరును కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని కమిషన్ చైర్‌పర్సన్‌కు వివరించారు. తమ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం చేయాలని సూచించినట్లు తెలిపారు. తప్పు చేసినవారిని శిక్షించాలని కోరారు.

**రెస్కో పరిధిలో నిర్ణీత గడువులోగా**

## విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్లు కట్

**- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు - విద్యుత్ సమస్యల పరిష్కారానికి 8న గ్రీవెన్స్ సెల్ !!**



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త : కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో నోటీసులు అందుకున్న వినియోగదారులు పదిహేను రోజుల్లోపు బిల్లులు చెల్లించకుంటే విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్, రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయ ంత్రం కుప్పం రెస్కో కార్యాలయంలో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. రెస్కో పరిధిలో 10వేలకు పైబడి బకాయిలు ఉన్న 3600మంది వినియోగదారు లకు ఇదివరకే నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. రెస్కో పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల 8న వినియోగదారుల గ్రీవెన్స్ సెల్‌ను కుప్పం రెస్కో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. సమావేశంలో రెస్కో ఎండి సోమశేఖర్, డిఇ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో మానవహక్కులను పరిరక్షించండి

**- రాజకీయ కక్షలతో భౌతికదాడులకు పాల్పడుతున్న టిడిపి శ్రేణులు**

**-జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్మెన్‌కు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఫిర్యాదు**



తిరుపతిరూరల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజక వర్గంలో రాజకీయ కక్షలు ఎక్కువైనాయని, టిడిపి అధికారం లోకి వచ్చాక వైకాపా కార్యకర్తలపై భౌతికదాడులు జరుగు తున్నాయని, మానవహక్కులను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్మెన్ విజయభారతికి విన్నవించారు. అధికార పార్టీ ఆగడాలకు కొంత ప్రభుత్వ అధికారులు కూడా సహకారం అందించడంతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులపై భౌతిక దాడులే కాకుండా ఇళ్ళు, వ్యాపారాలు సంస్థలపై దాడులు చేసి నష్టం కలిగించి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన కమిషన్ చైర్‌పర్సన్‌ను తిరుపతి పద్మావతి అతిధి గృహంలో కలిసి చంద్రగిరిలో నెలకున్న పరిస్థితులను చెవిరెడ్డి వివరించారు. గత రెండు నెలలుగా చంద్రగిరి నియోజక వర్గంలో అధికార టిడిపి నేతలు చేసిన భౌతికదాడులు, దౌర్జాన్యాలు, విధ్వంసాలు గురించి తెలియ జేసారు. అధికార బలంలో ప్రత్యర్థి పార్టీల హక్కుల భంగం కలిగిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. మానవహక్కులకు భంగం కలుగుతున్న తీరును తెలుసుకునేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సి కమిటీ సభ్యులను చంద్రగిరి పంపాలని విజ్ఞప్తి చేసారు. పౌర హక్కులకు భంగం కలిగించిన కొన్ని సాక్ష్యాధారాలతో పాటు వినతిపత్రాన్ని అందజేసారు. దీనిపై జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి స్పందిస్తూ గత 60రోజులుగా చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా జరగిన సంఘటనలపై విచారణకు ఆదేశించి, పౌరహక్కులకు భంగం కలిగించినవారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైతులను లాభాలబాట పట్టించడమే ఆత్మ ధ్యేయం

**- డిఆర్‌సి వ్యవసాయ అధికారి శ్రీనివాస్**



చిట్టమూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులందరినీ లాభసాటిగా మార్చడమే ఆత్మ ధ్యేయమని తిరుపతి జిల్లా డిఆర్‌సి వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆరోగ్యకరమైన వరి ధాన్యాన్ని భావి తరాలకు అందించాలంటే సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ సాగే శ్రేయస్కరమని ఆయన తెలియజేశారు. తిరుపతి డిఆర్‌సి నుంచి ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో వ్యవసాయమే ప్రధాన జీవన వృత్తిగా రైతులు ముందుకు సాగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా వరిపంట సాగులో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానవుల వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు ఎలా చేస్తామో పుడమి తల్లికి సైతం మట్టి పరీక్షలు చేసి తద్వారా ఆరోగ్యకరమైన పంటలకు అవసరమైన పోషకాలను సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. వరిలో నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వరి నాట్లలో ఒకటిన్నర అడుగు నుంచి రెండు అడుగులలోపే నీరు ఉండాలని తద్వారా అధిక పిలకలతో పాటు మంచి దిగుబడులు రైతులు పొందవచ్చని సూచించారు. నాడు ప్రజలందరు ఎంతో ఆరోగ్యంగా, బలంగా ఉండటానికి కారణం చిరు ధాన్యాలు సాగేనని ఆయన ఈ సందర్భంగా రైతులకు తెలియజేశారు. వారంలో రెండుసార్లు ప్రజలందరు చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు, కొర్రలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఆత్మ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. రైతులందరూ తప్పనిసరిగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకొని వ్యవసాయ అధికారులు, సైంటిస్టులు, గ్రామ వ్యవసాయ సహాయకుల సూచనలు, సలహాలు పాటించి మంచి లాభాలు పొందాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.

## రాజనాబండపై సత్య ప్రమాణాల జోరు



చౌడేపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త : రాజనాల బండపై శనివారం సత్యప్రమాణాల జోరు కొనసాగింది. ఉదయాన్నే ఆలయ ప్రధానార్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రసన్న ఆంజనేయ స్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వాములకు విశేషా భిషేకం, అలంకరణగావించారు. పుంగనూరు, పెద్దపంజాని, బైరెడ్డిపల్లి తదితర మండలాల నుంచి నగలు, నగదు పోగొట్టుకొన్నారు. అనుమానితులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రాజనాలబండపై సందడి నెలకొనింది. కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. టిటిడి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## ఎమ్మెల్యే భానుప్రకాశ్‌కు ఘన సన్మానం



పుత్తూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బెంగళూరు నుంచి వచ్చి తన గెలుపునకు కృషి చేసిన వారికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం బెంగళూ రులో తెలుగుదేశం పార్టీ కమ్మ సంఘం ఆధ్వర్యంలో భానుప్రకాశ్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బెంగళూరులో నివశిస్తున్న నగరి నియోజకవర్గానికి చెందిన ఓటర్లు తమ స్వగ్రామాలకు వచ్చి తన విజయానికి పాటుపడ్డారని తెలిపారు. అనంతరం హిందూపూర్ ఎంపి బి.కె.పార్థసారథి, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, ఎం.ఎస్.రాజు, ఆరణి శ్రీనివాసులు, ప్రసాద్, సురేంద్రబాబులను సన్మానించారు. కార్యక్రమంలో బెంగళూరు టిడిపి నాయకులు రాజేంద్రనాయుడు, లీలా శంకరరావు, యశ్వంత్, గజేంద్ర, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అధైర్య పడకండి అండగా మేముంటాం:పెద్దిరెడ్డి



సదుం, ఆగస్టు 3 ప్రభాతవార్త : ప్రభుత్వం లేదని ఎవరూ అధైర్య పడకండి తాము అందరికి అండగా ఉంటామని రాష్ట్ర మాజీ మంత్రి, పుంగ నూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన యర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి వారి ఆలయానికి వచ్చి ఆలయంలోని వివిధ దేవుళ్లకుపూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను కలవడానికి వచ్చిన వైకాపా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పలువురు వద్ద అర్జీలు తీసుకున్నారు. వైకాపా వారు పనులు చేస్తుంటే అడ్డుకుంటున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ ఆధైర్యపడవద్దని చెప్పారు. పనులన్ని సక్రమంగా జరుగుతాయని , అందరికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తంబళ్లపల్లె శాసనసభ్యుడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సోమశేఖరరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ధనంజయరెడ్డి, పుట్రాజు, మండల కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, బోయకొండ ఆలయ మాజీ సభ్యుడు భాస్కరరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచిలు హనుమంతురెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వైకాపా నాయకులు,గిరిరెడ్డి, యండపల్లె మనోహరరెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి,రాజశేఖర్,వెంకటరమణ,కువైట్‌హరినాథరెడ్డి, అన్నారెడ్డి, గుణాకరరెడ్డి, బాబురెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు..మంత్రి లోకేష్ చొరవతో విద్యాకేంద్రంగా కుప్పం

**- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, ఆగస్టు 3 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల చొరవతో కుప్పం ప్రాంతం విద్యా కేంద్రంగా మారుతోందని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొ న్నారు. శనివారం స్థానిక ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచితంగా స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో గ్రామగ్రామాన స్కూళ్లు, మండలాల్లో జూనియర్ కాలేజ్‌లు, ఉన్నత విద్యకు ఇంజనీరింగ్, వైద్యకళాశాలలు, ద్రవిడ వర్సిటీ సిఎం చంద్రబాబునాయుడు చొరవతోనే ఏర్పడ్డాయన్నారు. అతి త్వరలోనే కుప్పంలో కేంద్రీయ విద్యాలయాన్ని సైతం ప్రారంభించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. పేద విద్యార్థుల చదువులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, జనసేన నరేష్, బిజెపి శివశంకర్, స్థానిక నేతలు డా॥ వెంకటేష్, ఆర్ఆర్ రవి, కన్నన్, అప్పు, వేలు, అన్సర్, బాలాజీలు పాల్గొన్నారు.

## పిల్లలను పడుకోబెట్టి..పత్తాలేని అంగన్‌వాడీ టీచర్..ఆయా..!

గంగవరం,ఆగస్టు 3, ప్రభాతవార్త : పిల్లలను పడుకోబెట్టి అంగన్‌వాడీ టీచర్,ఆయాలు పత్తాలేకుండా పోయిన సంఘటన శనివారం మండలంలోని కీలపల్లె గ్రామంలో చోటు చేసుకుంది.ఈ ఘటన చూస్తే అర్థమవుతుంది అక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న తీరు ఏ పాటిదో.వివరాల్లోకి వెళ్ళితే మండలంలోని మూరుమూల గ్రామమైన కీలపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని అదే గ్రామానికి చెందిన చిన్నపాప అంగన్‌వాడీ టీచర్ గాను,భువనేశ్వరి ఆయాగా విధులు నిర్వహిస్తున్నారు.ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం 13 మంది పిల్లలు ఉన్నారు.ఈ నేపథ్యంలో శనివారం 9 మంది పిల్లలు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రానికి హజరయ్యారు.అయితే పిల్లలను చూసుకోవల్సిన టీచర్,ఆయాలు పిల్లలను పడుకోబెట్టి పత్తాలేకుండా పోవడం గమనార్హం.ఈ విషయమై ప్రభాతవార్త వివరణ కొరకు సంబధిత సిడిపిఒను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

## కేంద్ర మంత్రికి ఘన స్వాగతం

**కేంద్ర మంత్రిని సత్కరించిన కోలా ఆనంద్‌కుమార్**



రేణిగుంట, ఆగస్టు 3 ప్రభాతవార్త: కేంద్ర భారీ పరిశ్రమల, ఉక్కు మంత్రిత్వ శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం బీజేపీ నేతలు రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు. కోలా ఆనంద్‌కుమార్ కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు గజమాలవేసి పుష్పగుచ్చాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. కేంద్ర మంత్రిని శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించాలని ఆహ్వానిస్తూ స్వామివారి శేష వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెక్రటరీ, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్, జిల్లా సెక్రటరీ, అసెంబ్లీ కో-కన్వీనర్ మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు కునాటి నాగరాజు, ఈగల బాలాజీ, జీ పాళెం తేజోవతి, వేదం కృష్ణయ్య, కుప్ప ప్రసాద్, జీవీ అమర్‌నాథ్, ప్రధాన కార్యదర్శులు పుణ్యం ఢిల్లీకుమార్, పూజారి ప్రేమ్‌కుమార్, కండ్రిగ యతీంద్రా రెడ్డి, తానికొండ్ల భరత్, సజ్జల హరీష్, మురళి, కోలే షణ్ముగం, పోలూరు మధు, వెంకటేష్, వెంకట మునిరెడ్డి, సుమతి, మునివేలు, నాని తదితరులు పాల్గొన్నారు.

# గుడిమల్లంను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదాం : ఎంఎల్ఏ



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఆలయాలను కలుపుతూ ఆధ్యాత్మిక హబ్‌గా రూపొందించుటకు స్థానిక శాసన సభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. శనివారం ఊరందూరు గ్రామంలోని తన స్వగృహంలో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ గిరిబాబు ఇఒ రామ చంద్రారెడ్డిలతో ఎంఎల్ఏ సమీక్షించారు.గతంలో చైర్మెన్‌గా బత్తల గిరిబాబు ఆలయాభివృద్ధికి విశేష కృషి చేసారు. కనుమరుగుగా ఉన్న గుడిమల్లంను తెరపైకి తెచ్చారు. పురావస్తుశాఖ సహకారంతో పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుటకు ప్రయత్నాలు చేసారు.అంతేకాక ఆలయాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తీసుకొని అభివృద్ధి చేయాలని గతంలో మంత్రి గోపాలకృష్ణారెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి కూడా సాధించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొండమనాడు,బొక్కసం పాళెం, వేయిలింగాల కోన, దక్షిణ కాళిమాత ఆలయం, కాలభైరవస్వామి ఆలయం, గుడిమల్లం, బత్తినయ్య కోనలకు ఉచిత బస్సును శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో ఏర్పాటుకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు.

**గుడిమల్లంను ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి:**

ఈ నేపథ్యంలో శనివారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చర్చలు జరిపారు. ముఖ్యంగా గుడిమల్లం ఆలయం ప్రస్తుతం ఆర్కాలాజికల్ శాఖ పర్యవేక్షణలో ఉంది. ఆలయం లోపల ఎలాంటి మార్పులు చేర్పులు చేయటానికి వారు అంగీకరించరు.అయితే చారిత్రా త్మక మైన ఆలయమే కాకుండా భక్తి భావంఉటిపడే ఆలయం. నిర్మాణం.ఈ ఆలయం మారు మూల ఉండటంతో గుర్తింపుకు రావటం లేదని ఎంఎల్ఏ అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మాజీ చైర్మెన్ గిరిబాబు 2018-19లో ఈ ఆలయానికి జి.పాళెం నుంచి స్వర్ణముఖి ఒడ్డున పాపా నాయుడుపేట టౌన్‌లో వెళ్ళకుండా బైపాస్‌ను ఏర్పాటు చేయాలని సర్వే కూడా చేసి ప్రభుత్వానికి పంపామని వివరిం చారు. కానీ ఐదేళ్లు ఎవ్వరూ పట్టించుకోలేదని గిరిబాబు ఎంఎల్ఏకు వివరించారు.ఇక గతంలో అన్నదానం జరిపేవారమన్నారు. గుడిమల్లం ఆలయం చుట్టూ సుమారు 10ఇళ్లు ఉంటాయని వాటికి నష్టపరిహారం చెల్లించి సేకరించాలన్నారు.ఆలయం చుట్టూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆలయాభివృద్ధి అటకెక్కిందని గిరిబాబు తెలిపారు.ఆలయానికి సంబంధించి విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ఎంఎల్ఏ అభిప్రాయపడ్డారు. ఆలయ పరిస్థితిని గురించి తెలుసుకున్న ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి తాను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మీదట నిర్ణయం తీసుకుందామన్నారు.

వార్త దినపత్రికకు 28వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

చేయి చేయి కలుపుదాం.. కాలుష్యాన్ని నివారిద్దాం!

- నేటి నీటి వృధా... భావితరాల కన్నీటి వ్యధ
- వ్యర్థ పదార్థాలను తిరిగి వాడుదాం
- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- పరిసరాలను పరిశుభ్రంగా వుంచుదాం
- ఆరోగ్యవంతమైన జీవితం గడుపుదాం
- పచ్చదనాన్ని పెంచుదాం - కాలుష్యాన్ని అరికడదాం!



Late Sri MLN Sastry
Founder

కాలుష్య రహిత కర్మాగారమే పారిశ్రామికాభివృద్ధికి చిహ్నం

MALLADI

Malladi Drugs & Pharmaceuticals Ltd.,

Unit-5, A leading manufacturer of Bulk Drugs Works, Plot Nos. 49,50,55,56, IDA, Gajulamandyam, Attur (P.O.) Renigunta - 517520, A.P.